సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం | 23 | జూలై | 2023

'సాత్నాల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

జైనథ్: సాత్నాల ప్రాజెక్ట్‌కు శనివారం ఉదయం 5,930 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు మూడు గేట్లు ఓపెన్ చేశారు. సాయంత్రం వరద తగ్గడంతో వాటిని మూసి వేసారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నిల్వసామర్థ్యం 1.24టీఎంసీ, 286.5మీటర్ల ఎఫ్ఆర్ఎల్. ప్రస్తుతం 0.843 టీఎంసీ నీటినిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. 960 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు వెల్లడించారు.



గరిష్టం/కనిష్టం
30.0 /24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సహాయక చర్యల్లో పాల్గొనాలి



జూమ్ ద్వారా సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ నాయకులతో శనివారం జూమ్ సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు పలు సూచనలు చేశారు. పెన్‌గంగ పరివాహక ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికపుడు పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తినా వాటిని పరిష్కరించే దిశగా చూడాలన్నారు. పునరావాస కేంద్రాల్లోనూ అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు.

సమస్య తలెత్తితే సంప్రదించాలి



తాటిగూడలో వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

కైలాస్‌నగర్: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి సమస్య తలెత్తినా తక్షణమే అధికారులకు సమాచారం అందించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. భారీ వర్షాల దృష్ట్యా పట్టణంలోని జీఎస్ ఎస్టేట్, తాటిగూడ, గడియార్ మహల్, కేఆర్‌కే కాలనీ, వికలాంగుల కాలనీల్లో శనివారం ఆయన పర్యటించారు. వరద నీరు చేరిన ఇళ్లు, కాలనీలను పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరదనీటిని బయటకు పంపించేలా అప్పటికప్పుడుపొక్లెయిన్ల ద్వారా పనులు చేయించారు. ఎలాంటి సమస్యలున్నా తమను సంప్రదిస్తే పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధితులను ఆదుకోవాలి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న శంకర్

ఆదిలాబాద్: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని బంగారుగూడ కాలనీలో నీట మునిగిన ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. మూడు రోజులుగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి బాధితులను ఆదుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. కార్యాలయంలోని తన చాంబర్ నుంచి వైద్యాధికారులతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ప్రస్తుత పరిస్థితులపై ఆరాతీశారు. గర్భిణులు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి విజయ సారథి, ఆయా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎదులాపురం: హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ సహాయ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇందులో హమాలీ కార్మికులు ఉన్నారు.

జలదిగ్బంధం

- భారీ వర్షంతో జిల్లా అతలాకుతలం
- మహారాష్ట్ర నుంచి పెన్‌గంగకు వరద ఉధృతి
- పరీవాహక గ్రామాలను ముంచెత్తిన బ్యాక్ వాటర్
- జైనథ్, బేల, భీంపూర్ మండలాల్లో తీవ్రత
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



పెన్‌గంగ ఉధృతితో గుబిడి గ్రామంలోకి చేరిన వరదనీరు

సాక్షి,ఆదిలాబాద్: వరుణుడు కాస్త శాంతించాడు. అయినా జిల్లాలో లోతట్టు ప్రాంతాలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు శనివారం కాస్త తెరిపిచ్చినట్లయింది. మధ్యాహ్నం నుంచి వాన నిలిచింది. అయితే శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. 10సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు సాధారణాన్ని మించింది. సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. శుక్రవారం సాత్నాల మూడు గేట్లను తెరిచారు. మత్తడి వాగు రెండు గేట్లను తెరిచి వరదను దిగువకు వదిలారు. జిల్లాలోని 392 చెరువులు నిండిపోయి అలుగుపారుతున్నాయి.

పెన్‌గంగ పరీవాహకం అతలాకుతలం..

జిల్లాకు భీంపూర్, జైనథ్, బేల మండలాలకు పరీవాహకంగా ఉన్న పెన్‌గంగ నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువన మహారాష్ట్ర నుంచి నాలుగు లక్షల క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం పోటెత్తడం, పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం నీరు నదిలో కలిసే పరిస్థితి లేకపోవడంతో బ్యాక్ వాటర్ గ్రామాలను ముంచెత్తింది. దీంతో ఆయా గ్రామాల పరిస్థితి అతలాకుతలంగా తయారైంది. జైనథ్ మండలం కామాయి పూర్తిగా జలదిగ్బంధం అయింది. ఈ మండలంలోని కూర, దీపాయిగూడ, జైనథ్ కొత్తకాలనీలను వరద చుట్టుముట్టింది. బేల మండలంలోని బెదోడా, కాంగార్‌పూర్, గూడ, మణియార్‌పూర్ జగదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భీంపూర్ మండలంలో గుబిడి, అర్లి(టి), వడూర్‌లదీ ఇదే పరిస్థితి.

వాగులో కొట్టుకువచ్చిన మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్ మండలం బంగారుగూడ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది.ఇందులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. భీంపూర్ మండలం వడూర్ నివాసి దాదీప్ పెన్‌గంగలో నాటుపడవను బయటకు తెచ్చేందుకు వెళ్లి వరద ప్రవాహంలో చిక్కుకున్నాడు. స్థానిక ఎస్సై రాధిక సూచన మేరకు గ్రామ యువకులు టైర్‌కు తాళ్లు కట్టి అతన్ని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. బేల మండలంలోని దహెగాం, హస్నాపూర్ గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. జైనథ్ మండలం పూసాయి ఎల్లమ్మ ఆలయం చుట్టూ పెద్దఎత్తున వరద చుట్టుముట్టింది.

జిల్లా కేంద్రంలో బీభత్సం..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భారీ వర్షానికి పలు కాలనీలను వరద ముంచెత్తింది. జీఎస్ ఎస్టేట్ చెరువును తలపించింది. ఇండ్లు సగానికి నీట మునిగాయి. తాటిగూడలోనూ ఇదే పరిస్థితి. వికలాంగుల కాలనీ, బంగారుగూడ, ఖానాపూర్‌లోనూ వరద బీభత్సం కనిపించింది. ఎమ్మెల్యే రామన్న పెన్‌గంగ నదిలో ప్రవాహన్ని పరిశీలించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మండల ప్రత్యేక అధికారులతో జిల్లా కేంద్రంలో సమావేశమై వరద పరిస్థితిపై సమీక్షించారు.

పెరుగుతున్న నష్టం..

జిల్లాలో 20వేల ఎకరాల వరకు నీట మునిగాయి. విద్యుత్ శాఖకు రూ. 26 లక్షలవరకు నష్టం సంభవించింది. బేల మండలంలో నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి. ఆర్అండ్‌బీకి సంబంధించి బోథ్ మండలంలో నిగిని, మర్లపల్లి, జైనథ్ మండలం దీపాయిగూడతో పాటు తలమడుగు, నార్నూర్, సిరికొండ, గాదిగూడ మండలాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. పంచాయతీరాజ్‌రోడ్లు 55 కిలో మీటర్ల పరిధిలో నష్టం సంభవించింది. నష్టం అంచనా సుమారు రూ.56 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

తాంసి: పెన్‌గంగ ప్రవాహం శనివారం రాత్రి మరింత పెరిగే అవకాశం ఉందని భావించిన భీంపూర్ మండలం అంతర్గాం వాసులంతా ఆందోళన చెందారు. ఒకే చోట చేరి రాత్రంతా జాగరణ చేశారు.

జిల్లాలో శనివారం వర్షపాతం వివరాలు

సాధారణం: 17.0 మిల్లీ మీటర్లు
కురిసింది: 99.9 మిల్లీ మీటర్లు
వ్యత్యాసం: 438 శాతం అధికం

జూన్ 1 నుంచి జూలై 22 వరకు వర్షపాతం వివరాలు..

సాధారణం: 415.4 మిల్లీ మీటర్లు
కురిసింది: 524.3 మిల్లీ మీటర్లు
వ్యత్యాసం: 26 శాతం అధికం
స్థితి: అధిక వర్షపాతం

మండలాల పరిస్థితి..

ఇచ్చోడ, సిరికొండలో అత్యధిక వర్షపాతం నమోదు అయింది. గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, మావల, భీంపూర్, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండలలో అధిక వర్షపాతం నమోదు అయింది. బేల, జైనథ్, ఆదిలాబాద్‌అర్బన్, ఆదిలాబాద్ రూరల్, తాంసి, తలమడుగులలో సాధారణ వర్షపాతం నమోదు అయింది.

చెరువులను తలపించిన పంటపొలాలు



భోరజ్ సమీపంలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఇటు భారీ వర్షం కురుస్తుండటం.. మరో పక్క పెన్‌గంగ నదికి ఎగువన మహారాష్ట్ర నుంచి వరద ప్రవాహం పెరిగి బ్యాక్ వాటర్ తీర ప్రాంతాల్లోని పంట పొలాలను నిండా ముంచేసింది. పంట పొలాలు చెరువులను తలపించాయి. జైనథ్ మండలంలోని పెండల్‌వాడ, ఆనంద్‌పూర్, కౌట, కూర, లేకర్‌వాడ, దీపాయిగూడలో పంట పొలాల్లో నీరు చేరింది. బేల మండలంలోని బేదోడా, కాంగార్‌పూర్, గూడ, మణియార్‌పూర్, దహెగాం,సాంగిడిలలో పంట పొలాలు నీట మునిగాయి. భీంపూర్ మండలంలోని గుబిడి, అంతర్గాం, గోముత్రి, అర్లి(టి), వడూర్, గొల్లఘాట్, తాంసి గ్రామాల్లోనూ అదే పరిస్థితి. సాత్నాల వాగు ఉప్పొంగడంతో పరీవాహక ప్రాంతాలు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పంట చేలు నీట మునిగాయి. జిల్లాఅంతటా ఈ వర్షాల కారణంగా 20వేల ఎకరాల వరకు పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

నీట మునిగిన వంతెనలు..

జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ నుంచి మహారాష్ట్రలోని దిగ్రస్‌కు పెన్‌గంగ నదిపై నుంచి వెళ్లే వంతెన పూర్తిగా నీట మునిగింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. బేల మడలంలోని దహెగావ్, మణియార్‌పూర్, గూడ, కాంగార్‌పూర్, బెదోడా లోలెవల్ వంతెనలు నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తలమడుగు మండల కేంద్రంలోని వంతెన పై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు స్తంబించాయి. ఉట్నూర్ మండలం నర్సాపూర్ (జె) గ్రామ వాగు ఉప్పొంగడంతో అక్కడి నుంచి గిరిజనులు రాకపోకలు తంటాలు పడ్డారు.



ఆనంద్‌పూర్ వద్ద పెన్‌గంగ బ్రిడ్జిపై నుంచి వరద ప్రవాహం ఇలా..

విద్యుత్‌శాఖకు రూ.26 లక్షల నష్టం



కుప్పకూలిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ సంపత్‌కుమార్

కైలాస్‌నగర్: జిల్లాలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు విద్యుత్ శాఖకు భారీ నష్టాన్ని తెచ్చిపెట్టాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగి పడగా, ట్రాన్స్‌ఫార్మర్లు కుప్పకూలాయి. స్తంభాలు నేలకొరిగాయి. ఆయా చోట్ల కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా, సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు, సిబ్బంది చర్యలకు ఉపక్రమించారు. ఆయా ప్రాంతాలను ఎస్ఈ సంపత్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా రూ.26.79 లక్షల నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేశారు. వాటి వివరాలు పరిశీలిస్తే....

కంట్రోల్ రూం ఏర్పాటు

వర్షాల కారణంగా తలెత్తే విద్యుత్ సమస్యలను తెలిపేందుకు గాను ప్రత్యేక కంట్రోల్ రూంఏర్పాటు చేశారు. తేదీల వారీగా ఏఈ, ఏఈఈ స్థాయి అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించారు. ఈనెల 23న ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు హిమబిందు 9494954838, రాత్రి 8నుంచి మరుసటి రోజు ఉదయం 8గంటలవరకు డి.శంకర్ 9493137269, 24న జి.మనోహర్ 9440814884, మదన్‌లాల్ చౌదరి 9440814170, 25వ తేదీన బి.శ్రీనివాస్ రావు 9490614548,డి.సత్యనారాయణ 7396561966లను ఇన్‌చార్జీలుగా నియమించారు. విద్యుత్ సమస్యలపై ప్రజలు ఆయా నంబర్లను సంప్రదించి సమాచారం అందించాలని ఎస్ఈ సూచించారు.

లైన్	ధ్వంసమైన స్తంభాలు	నష్టం (రూ.లలో..)
33కేవీ	రెండు	50వేలు
11కేవీ9.1మీటర్లు	24	4.32లక్షలు
11కేవీ 8మీటర్లు	62	9.30లక్షలు
ఎల్‌టీ లైన్ల స్తంభాలు	39	5.07 లక్షలు
ట్రాన్స్‌ఫార్మర్లు	08	7.60లక్షలు



వరద నీటితో కోతకు గురైన లాలాటెకిడి రోడ్డు



దెబ్బతిన్న దీపాయిగూడ ఆర్అండ్‌బీ రోడ్డు



లేకర్‌వాడ ఎస్సీ కాలనీలో ఇలా..



బిక్కుబిక్కుమంటూ.. అంతర్గాంలో శనివారం రాత్రి ఒకచోట చేరిన గ్రామస్తులు

బాధ్యులను ఉరి తీయాలి



నిరసన తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై లైంగికదాడులకు పాల్పడిన ఘటనను ఖండిస్తున్నామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. కుకీ తెగకు చెందిన మహిళలను అపహరించుకుపోయి చిత్ర హింసలకు గురి చేసిన వారిని ఉరి వేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో శనివారం రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన మహిళలపై మైతేయ తెగకు చెందిన వారు దాడులకు పాల్పడి చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో 150 మంది ఆదివాసీలు చనిపోయారన్నారు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు స్పందించి ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, జిల్లా ప్రచార కార్యదర్శి మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఇందిర, డివిజన్ అధ్యక్షురాలు గంగాదేవి, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు సలాం వరుణ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి

- సెలవులు వద్దు.. అందరూ విధుల్లో ఉండాలి
- అధికారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులు, చెరువుల్లో వరద నీరు అధికంగా వచ్చి చేరుతోందన్నారు. ఈ క్రమంలో లోతట్టు, సమీప గ్రామాల్లో ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇళ్లు, పొలాల్లో వరద నీరు చేరిన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పునరావాస కేంద్రాల ద్వారా భోజనం, వసతి కల్పించాలన్నారు. తక్షణ సహాయ చర్యల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూం నంబర్ 1800–425–1939ను ప్రజలు సంప్రదించాలని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సెలవులలో వెళ్లవద్దని, ప్రతి ఒక్కరు విధుల్లో ఉండాలని ఆదేశించారు. శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ మరణం తీరని లోటు

- ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: మాజీ మంత్రి సి.రామచంద్రారెడ్డి మరణం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులకు తీరని లోటని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. శనివారం సీఆర్ఆర్ నివాసంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ, సీఆర్ఆర్ మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేందన్నారు. ఆదివాసుల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. రాజకీయాలు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధి పనులు ఎప్పటికీ నిలిచిపోతాయన్నారు. బోథ్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, ఆదివాసీల సమస్యల పరిష్కారంలో ఆయన కృషి మరవలేనిదని కొనియాడారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రమణ, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, జెడ్పీటీసీ మల్లెపూల నరసయ్య, కాంగ్రెస్ నాయకులు నరేష్ జాదవ్, తదితరులున్నారు.



సీఆర్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ

క్లుప్తంగా

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో కూలిన సీలింగ్


కూలిన సీలింగ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రెండో, ఐదో అంతస్థుల్లోని సీలింగ్ వర్షాలతో శనివారం కుప్పకూలింది. ఆ సమయంలో రోగులు, వైద్య సిబ్బంది లేక పెను ప్రమాదం తప్పింది. రెండో అంతస్థులో ఆపరేషన్ థియేటర్‌తో పాటు కార్డియాలజీ వార్డు ఉండగా, ఐదో అంతస్థును ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అక్కడికి చేరుకుని సీలింగ్ కూలడానికి గల కారణాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షపునీరు లీకేజీ కారణంగా సీలింగ్ పడిపోయిందని వారు డైరెక్టర్‌కు వివరించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడిన డైరెక్టర్ యథాస్థితికి తీసుకురావాలని ఆదేశించారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: చాలీచాలని వేతనంతో దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నిర్మల్ జిల్లా స్వీపర్ల సంఘం అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్వీపర్లకు ఉత్తర్వులతో సంబంధం లేకుండా వేతనాలను చెల్లిస్తున్నారని అన్నారు. 112, 212 ఉత్తర్వుల ప్రకారం స్వీపర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురవుతున్నందునే స్వీపర్లంతా ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్నప్పటికీ వారికి నేటికీ న్యాయం జరగడం లేదన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రహశకలాల అన్వేషణలో పాల్గొనండి

నిర్మల్ రూరల్: ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ సెర్చ్ క్యాంపెయిన్ (నాసా భాగస్వామ్యంతో) గ్రహశకలాల పరిశోధనలో విద్యార్థులు పాల్గొనే అవకాశాన్ని కలెక్టర్, విద్యాశాఖ అవకాశం కల్పిస్తోందని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 9, 10 తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 9, 10వ తరగతి చదువుతూ కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి, వివిధ యాప్‌ల్లో శోధించకలిగే సామర్థ్యం గలవారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తమ పేర్లను ఆదివారంలోగా నమోదు చేసుకోవాలని, మిగతా వివరాలకు జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ వినోద్‌ను సంప్రదించాలని కోరారు.

కలప దొంగల అరెస్టు

ముథోల్: టేకు కలప దొంగలను పట్టుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. వివరాల ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి ముథోల్‌కు చెందిన కొనుపాక్ మధుకర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోని టేకు చెట్లను బులోరా వాహనంలో వచ్చిన దొంగలు నరుకుతుండగా గమనించిన పలువురు రైతుకు సమాచారం ఇచ్చారు. సదరు రైతు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. మరో నలుగురు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదే క్షేత్రంలో గత నెల 26న రూ.15లక్షల విలువ చేసే 24 టేకు దుంగలు దొంగలు ఎత్తుకెళ్లారు.

అతలాకుతలం

ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనం తల్లడిల్లిపోతున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో జనజీవనం అతలాకుతలమవుతోంది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు గ్రామాలకు వెళ్లే వంతెనలపై నుంచి వాగులు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రోడ్లుకు కోతకు గురికాగా, ఇళ్లు కూలిపోతున్నాయి.

ఇళ్లలోకి వరద

కైలాస్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఆదిలాబాద్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లపైకి వరదనీరు ప్రవహిస్తుండగా ఇళ్లలోకి వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జీఎస్ ఎస్టేట్ కాలనీ పూర్తిగా జల దిగ్బంధనంలో చిక్కుకుంది. కాలనీలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వాహనాలు సైతం అతికష్టం మీద ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. అదే విధంగా పట్టణంలోని తాటిగూడ, వికలాంగుల కాలనీ, బంగారుగూడ, ఖానాపూర్, సర్వే నంబర్ 170 కాలనీల్లో వరదనీరు భారీగా వచ్చి చేరింది. రోడ్లపై మోకాళ్లోతు నీరు నిలువగా, పలు ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరింది. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఇళ్లలోని నిత్యావసర సరుకులతో పాటు సామగ్రి పూర్తిగా తడిసిపోయింది. అలాగే సర్వే నెంబర్ 170లో భారీగా వర్షపునీరు నిలిచి ప్రజలు రాకపోకలకు అవకాశం లేకుండాపోయింది. ఈ విషయం తెలియడంతో వెంటనే కాలనీకి చేరుకున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సహాయక చర్యలకు ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో తవ్వకాలు చేపట్టి వరదనీటిని బయటకు పంపించేలా చర్యలు చేపట్టారు.


వికలాంగుల కాలనీలో ట ఇంటి ఆవరణలో చేరిన వరద


కడెం: పొంగి ప్రవహిస్తున్న పెద్దమడుగు


కైలాస్‌నగర్: వరద వెళ్లేందుకు పనులు..


కడెం: రోడ్డుపై చేపలు పడుతున్న స్థానికులు

జలదిగ్బంధంలో నాలుగు గ్రామాలు


బెదోడ గ్రామ శివారులో పెన్‌గంగ బ్యాక్‌వాటర్

బేల: కురుస్తున్న వర్షాలతో పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో మండలంలోని పెన్‌గంగ పరివాహక ప్రాంతాలైన బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్ గ్రామాలు శనివారం జలదిగ్బంధంలోకి వెళ్లాయి. దీంతో ఈ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. సాంగిడి రింగ్ రోడ్డు మార్గంలోని ఈ నాలుగు గ్రామాలతో పాటు సాంగిడి, దహెగాం గ్రామాల శివారుల్లోని లోలెవల్ వంతెనలపై వరద ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ ఆరు రెవెన్యూ గ్రామాలతో పాటు కోగ్దూర్, మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామాల శివారుల్లో మొత్తంగా 1,300 ఎకరాల వరకు పంట పొలాలు పూర్తి నీటమునిగినట్లు వ్యవసాయ బృందం అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.


హస్నాపూర్ గ్రామంలో ఇళ్లలో చేరిన వరద

స్మశానవాటికలోకి వరద ప్రవాహం


పెన్‌గంగ నదిఒడ్డున దహన సంస్కారాలు

తాంసి: పెన్‌గంగ నది వరద ప్రవాహంతో ఉగ్రరూపం దాల్చడంతో భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన స్మశాన వాటికలోకి వరద నీరు వచ్చి చేరింది. శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన తుకారం అనే వృద్ధుడు వయోభారంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు చేసేది లేక పెన్‌గంగ నది ఒడ్డున వృద్ధుడి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కోతకు గురైన బ్రిడ్జిపై యువకుల కాపలా


వంతెనపై వరదలో కాపలాగా యువకులు

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్, అర్లి(టి) గ్రామాల మధ్య అంతర్రాష్ట్ర రోడ్డుపై వంతెన వర్షాలకు కోతకు గురైంది. కోతకు గురైన బ్రిడ్జిపై పూర్తిగా వర్షపునీరు నిలిచింది. బ్రిడ్జిపై వరద నీరు అధికంగా నిలువడంతో ఎక్కడ బ్రిడ్జి ఉందో ఏటు వైపు బ్రిడ్జి కోతకు గురైందో తెలియని పరిస్థితి. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని అర్లి(టి) గ్రామానికి చెందిన యువకులు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన టీకం దిలీప్, అశోక్, నితిన్, ఆకాష్ అనే యువకులు బ్రిడ్జి వద్ద కాపలాగా ఉండి వాహనదారులకు సూచనలు చేశారు. కోతకు గురైన బ్రిడ్జి వైపు పెద్ద చెట్టు దుంగను సైతం ఏర్పాటు చేశారు.

పొంగుతున్న కడెం వాగు


కుప్టి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కడెం వాగు

నేరడిగొండ: రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం కడెం వాగు ఉగ్రరూపం దాల్చడంతో వరదనీటి తాకిడికి వాగు సమీపంలోని ప్రాంతాలు కుప్టి, కుమారి, గాజిలి, గాంధారి, తర్నం, వాగ్దరి, మాదాపూర్, వెంకటాపూర్, కుంటాల తోపాటు ఆయా లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లోని పంట పొలాలు జలమయమయ్యాయి. వేలాది ఎకరాల పత్తి, సోయా, కంది పంటలు నీటమునిగి తీవ్రనష్టం వాటిల్లింది. పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చేటట్లు కనబడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న కడెం వాగు

అపార నష్టం


వర్షం కారణంగా కూలిపోయిన ఇల్లు


బ్యాక్‌వాటర్‌లో నీటమునిగిన పంటపొలాలు

ఖానాపూర్: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కడెంకు భారీగా వరదవచ్చి చేరుతోంది. కడెం బ్యాక్‌వాటర్‌తో మండలంలోని ఎర్వంతల్, కోలాంగూడ పంచాయతీల పరిధిలోని రైతుల పత్తి, మొక్కజొన్న, పసుపు తదితర పంటపొలాలు నీటమునిగాయి. బ్యాక్‌వాటర్‌తో యేటా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం అందడం లేదు. మండలంలోని పాత ఎల్లాపూర్ – నడింపల్లె మధ్య గల రోడ్డుడ్యాంతో పాటు కొమ్ముతండా చొంతొర్రె, తదితర రోడ్డు డ్యాంలపై నీరుపారడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఖానాపూర్ నుంచి దిలావర్‌పూర్, తర్లపాడ్ గ్రామాలకు వెళ్లే మార్గంలోని రెంకోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన ఆడెపు నర్సయ్య ఇళ్లు వర్షంతో తడిసి కూలిపోయింది.

గోదావరిలోకి భారీగా వరద


గోదావరిలోకి వెళ్తున్న వరదనీరు

ఖానాపూర్: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని సదర్మాట్‌కు వస్తున్న భారీ వరద గోదావరిలోకి వెళ్తోంది. సదర్మాట్ గరిష్ఠ నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 8.4 ఫీట్లలో నీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఎగువ నుంచి వచ్చిన 7168 క్యూసెక్కుల వరద నీరు గోదావరిలోకి వెళ్తోందని ఏఈఈ ఉదయ్ తెలిపారు. సదర్మాట్ వద్ద పెరిగిన వరద ఉధృతిని చూసేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. సదర్మాట్ వద్ద ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరికి లోనికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వడం లేదు.



ముసురులో చేపల వేట

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా కేంద్రంలో పలు చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. జిల్లా కేంద్రంలోని కంచరవుని చెరువు, చుట్టుపక్కల ఉన్న కుంటల్లో స్థానికులు చేపల కోసం వలలు పట్టుకుని, పారుతున్న నీటిలో కొందరు యువకులు కర్రలు పట్టుకుని చేపలు వేటలో నిమగ్నమయ్యారు. చిన్నపిల్లలు చీరలు పట్టుకొని చేపల కోసం ప్రయత్నిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



వాగులో కొట్టుకొచ్చిన మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో శనివారం ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చిందని ఎస్సై నాగనాథ్ తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని రిమ్స్ మార్చురికి తరలించారు. మృతుడు వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉంటుందని వివరించారు. సంబంధికులు ఎవరైనా ఉంటే ఆదిలాబాద్ రూరల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

మామడ: మండలంలోని న్యూసాంగ్వి గ్రామానికి చెందిన గుర్రపు రాజు(23) శనివారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్సై కె.రాజు వివరాల ప్రకారం... గుర్రపు రాజు గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన దంతె సాయన్న ఇంటి ఎదుట అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. యువకుడి మృతదేహాన్ని గమనించిన కాలనీవాసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుర్రపు రాజు తల్లి రుక్మాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కస్తూరిబాలో పాము కలకలం

కుభీర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఇద్దరు బాలికలు మూత్రశాలలకు వెళ్తుండగా పాము వారి కాళ్ల మధ్యలో నుంచి వెళ్లింది. దీంతో వారు ఆందోళనకు గురికావడంతో వారిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు ప్రమాదం ఏమి లేదని తెలిపాడు. అనంతరం పరిశీలన కోసం భైంసాలోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా విద్యార్థినులు పామును చూపి బయపడ్డారని, పరిశీలన కోసం ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ కడెంపై లేదు

- టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్


వరదగేట్లను పరిశీలిస్తున్న భరత్‌చౌహాన్

కడెం: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ కడెంపై లేదని టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్ అన్నారు. కడెం గేట్లు మొరాయించడంతో శనివారం ప్రాజెక్ట్‌ను సందర్శించి సీఈ శ్రీనివాస్‌తో మాట్లాడారు. మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరారు. గత ఏడాది వర్షాలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్‌కు సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం సిగ్గుచేటని, కమీషన్లు రావనే కడెం ప్రాజెక్ట్‌ను పట్టించుకోక.. వందల కోట్ల రూపాయలు కాళేశ్వరానికి పెడుతున్నారని, కడెం ఆయకట్టు రైతులు ఏ పాపం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, వెంకటేశ్, ప్రతాప్ ఉన్నారు.

స్వయం ఉపాధిలో రాణించాలి


కుట్టుమిషన్ అందిస్తున్న దృశ్యం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ స్టేట బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథ్ శనివారం సందర్శించారు. సంస్థ అందిస్తున్న శిక్షణపై అడిగి తెలుసుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో పర్యటిస్తూ నిరుపేదలైన ఒకరికి తనవంతుగా కుట్టుమిషన్ అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆసిఫాబాద్ జిల్లా పారా గ్రామానికి చెందిన వికలాంగురాలైన పూసం గౌడన్‌కు కుట్టుమిషన్ అందించారు. ఉచిత శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేడు మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లక్ష్మణ్, నిర్మల్ అడిషనల్ డీఆర్డీవో గోవింద్‌రావు, డీపీఎం జ్ఞాను, అన్నాజీ, సంస్థ సిబ్బంది ఆశన్న, మల్లయ్య, సతీష్, రమేశ్, బాబు ఉన్నారు.

బాబెరలో క్షుద్ర పూజల కలకలం


పాఠశాలలో ఉన్న పసుపు, నిమ్మకాయలు

బోథ్: మండలంలోని బాబెరా తండా గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పూజలు నిర్వహించారు. శనివారం పాఠశాల అవరణలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు స్థానికులకు కనిపించాయి. ఎవరో క్షుద్ర పూజలు నిర్వహించారని గ్రామస్తులు పేర్కొన్నారు. పాఠశాలలో ఇలా పూజలు చేయడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్ నిర్వహకుడిపై కేసు

గుడిహత్నూర్: నకిలీ కుల ధృవీకరణ పత్రం తయారు చేసి ఇచ్చిన ముర్కుటే బాలాజీపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రహమాన్ తెలిపారు. మండలంలో బోగస్ సర్టిఫికెట్ల దందా పేరున శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో తహసీల్దార్ సంధ్యారాణి కార్యాలయ సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్ ఇనేష్‌తో ఫిర్యాదు చేయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.